# నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

## ఆల్బెండజోల్ మాత్రలపై అవగాహన ర్యాలీలు నిర్వహించిన వైద్యసిబ్బంది


సిరికొండలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీలో..


ఇందల్వాయిలో..

కమ్మర్‌పల్లి/మోర్తాడ్/మాక్లూర్/ఆలూర్/ కోటగిరి / రుద్రూర్/ సిరికొండ/ ఇందల్వాయి/ రెంజల్, జూన్ 19 : నులిపురుగుల నివారణ కోసం ఒకటి నుంచి 19 ఏండ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యాధికారులు సూచించారు. గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలపై వైద్యారోగ్య సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సమత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రల పంపిణీపై డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య రానివాల్కర్ అవగాహన కల్పించారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నులిపురుగుల నివారణ టాబ్లెట్లను పంపిణీ చేస్తామని డాక్టర్ సుప్రియ తెలిపారు. 20న మాత్రలు తీసుకోని వారికి 27న వేస్తామని చెప్పారు. మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆలూర్ మండలంలోని కల్లడి గ్రామంలో మెడికల్ ఆఫీసర్ ప్రకాశ్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

కోటగిరి మండల కేంద్రంలో నట్టల నివారణ మాత్రలపై పాతంగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంఈవో మారుతి, సూపర్‌వైజర్లు జ్యోతి, సాయి కుమారి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు. రుద్రూర్ మండలకేంద్రంలో హెచ్‌ఈవో రాజేందర్, సూపర్‌వైజర్ రవి ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిరికొండ మంల కేంద్రంలో వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇందల్వాయిలో మండల ఆరోగ్య విస్తరణాధికారి శంకర్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకుడు అక్బర్‌అలీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్ మండల పరిషత్ కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లకు మండల వైద్యాధికారి వినయ్‌కుమార్ అవగాహన కల్పించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు కులకర్ణి, ఎంపీవో గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలి


బొంకన్‌పల్లి పాఠశాలలో పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్, జూన్ 19: ముల్లంగి(బి), బొంకన్‌పల్లి గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో జైక్రాంతి, పీఆర్ ఏఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఘనంగా సామ్రాజ్య దినోత్సవం


విజయభేరి కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

సుభాష్‌నగర్, జూన్ 19 : నగరంలోని విజయలక్ష్మి గార్డెన్‌లో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఇందూరు విభాగ్ ప్రతినిధి వరంగంటి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ గురించి కొంతమంది వాస్తవాలను వక్రీకరిస్తూ, తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి యువత వాస్తవ చరిత్రను గమనించాలని సూచించారు. అనంతరం విజయభేరి పేరుతో కవాతు నిర్వహించి, ఆర్‌ఆర్ చౌరస్తాలోని శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్డీవో వెంకటయ్య, జిల్లా కార్యనిర్వహణ ప్రతినిధి దస్తగిరి, సత్యం, వెంకటేశ్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు నేరుగా తమ సమస్యలు విన్నవించుకోవచ్చు

కంఠేశ్వర్,జూన్ 19 : జిల్లా కేంద్రంలోని మారుతీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయాన్ని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను విన్నవించేందుకు కార్యాలయాన్ని ప్రారంభిచామని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఎల్‌వోసీ కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడి నుంచే సేవలందించేందుకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సమస్యల పరిష్కారం కోసం కార్యాలయంలో విన్నవించుకోవచ్చని తెలిపారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు**

ఇందల్వాయి/ రుద్రూర్/మోర్తాడ్/వేల్పూర్/బాల్కొండ/ రెంజల్/ బోధన్ రూరల్, జూన్ 19: జిల్లాలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు బుధవారం నిర్వహించారు. ఇందల్వాయిలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కేక్ కట్ చేశారు. జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కేక్ కట్ చేశారు. రుద్రూర్, బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, సాలూరా మండల కేంద్రాలు, బాల్కొండ మండలం కిసాన్‌నగర్, రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.

## అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభం

వేల్పూర్, జూన్ 19: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులను ప్రధానోపాధ్యాయుడు రాజన్న బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

## అధికారులకు వివిధ గ్రామస్తుల వినతి


అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


పొతంగల్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మంజీరా సరిహద్దు ప్రాంత రైతులు

వినాయక్‌నగర్/ కంఠేశ్వర్/ పొతంగల్, జూన్ 19 : జిల్లాలోని పలు గ్రామాల నుంచి పలువురు వ్యక్తులు చేస్తున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ ఆయా గ్రామస్తులు అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. భీంగల్ మండల పరిధి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, దీనిని అరికట్టాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, నిజామాబాద్ అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. భీమ్‌గల్ మండలం బెజ్జోరా గ్రామంలోని రెండు ప్రాంతాల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. భీంగల్ మండలంలోని భీంగల్, బడాభీంగల్ కప్పల వాగులో మాత్రమే ప్రభుత్వం ఇసుక తవ్వకానికి అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. బెజ్జోర నుంచి కాంగ్రెస్ నాయకులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై భీంగల్ తహసీల్దార్, పోలీస్ శాఖ, మైనింగ్ అధికారులు, ఆర్మూర్ ఆర్డీవో, ఏసీపీలకు వినతి పత్రం అందజేసినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జడ్పీటీసీ సభ్యుడు రవి, ఎంపీపీ మహేశ్, జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు మొయిజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య ఉన్నారు.

పొతంగల్ ప్రాంతం నుంచి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి చెందిన వారు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని మంజీరా సరిహద్దు ప్రాంత రైతులు పొతంగల్ తహసీల్దార్ మల్లేశ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మహారాష్ట్రకు చెందిన ఇసుక మాఫియా రాత్రి వేళలను ఇసుకను తరలిస్తున్నారని, భూగర్భ జలాలు తగ్గి, పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతున్నదని ప్రశ్నించగా.. తమపై దాడి చేశారని తెలిపారు. తమపై అకారణంగా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొట్టాల గంగాధర్, పాగాల నాగయ్య, సూదం నాగేశ్, శంకర్ పాల్గొన్నారు.

## ఉర్దూఘర్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం..

**రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, కార్యదర్శి, డైరెక్టర్ లియాఖత్ హుస్సేన్**

బోధన్, జూన్ 19: పట్టణంలోని ఉర్దూఘర్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ కార్యదర్శి, డైరెక్టర్ లియాఖత్ హుస్సేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఉర్దూఘర్ కమ్ షాదీఖానాను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ సమక్షంలో ఉర్దూ అకాడమీ అధికారుల బృందంతో కలిసి కార్యదర్శి సందర్శించారు. శిథిలావస్థలో ఉండి, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఉర్దూఘర్‌ను, పరిసరాలను ఆ బృందం పరిశీలించింది. అనంతరం ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ సమక్షంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉర్దూ ఘర్ శిథిలావస్థలో ఉందని, దీని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తామని ఆయన చెప్పారు. ఏడేండ్ల కిందట అప్పటి కలెక్టర్ నియమించిన ఉర్దూఘర్ కమిటీ కాలపరిమితి ముగిసిపోయిందని, త్వరలో కొత్త కమిటీని నియమిస్తామన్నారు. ఉర్దూఘర్ స్థలాన్ని ఆక్రమించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసిందని, ఎవరైనా అలాచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, డబ్బు, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసుద్దీన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


బోధన్‌లోని ఉర్దూఘర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఆ అకాడమీ కార్యదర్శి లియాఖత్ హుస్సేన్

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా ..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, జూన్19: నియోజవకర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గానికి మంచి రోజులు వస్తున్నాయని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని ఇటీవల కలిశామని అన్నారు. నియోజకవర్గంలో అన్ని శాఖల అధికారులు అవినీతికి పాల్పడకుండా నిజాయితీగా పనులు చేయాలని అన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## సర్వేను వేగవంతం చేయాలి


బషీరాబాద్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మోర్తాడ్, జూన్19: మిషన్‌భగీరథ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో బుధవారం మిషన్‌భగీరథ సర్వేను పరిశీలించారు. సర్వే పనులను తొందరగా పూర్తిచేయాలని గ్రామ అధికారులకు చెప్పారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని, రోజు నీళ్లు పట్టించాలని చెప్పారు.


రెంజల్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పిట్ల కృష్ణమహారాజ్, నాయకులు

## శివాజీమహారాజ్ విగ్రహావిష్కరణ

రెంజల్, జూన్ 19: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన ధర్మ భూమిపై జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని మల్లారం లింగేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన శివాజీ మహరాజ్ విగ్రహాన్ని పిట్ల కృష్ణ మహరాజ్, ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మహరాజ్, మాట్లాడారు... మాతృ హృదయంతో ధర్మ సామ్రాజ్యాన్ని తీసుకువచ్చింది చత్రపతి శివాజీ మహారాజ్ అని గుర్తు చేశారు. శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన వారిని శివాజీ ఉత్సవ కమిటీ తరపున సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డీ మోహన్‌రెడ్డి, ఎంపీపీ లోలపు రజినీ కిశోర్, జడ్పీటీసీ మేక విజయా సంతోష్, మాజీ సర్పంచులు రమేశ్‌కుమార్, రచ్చ సుదర్శన్, శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అధికారులతో ప్రభుత్వ సలహాదారు సమీక్ష

కంఠేశ్వర్, జూన్ 19 : నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ బుధవారం భేటీ అయ్యారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి నగరంలోని పలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీల తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించిన సమస్యలను అధికారులు వివరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్‌ను కోరారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఏర్గట్ల, జూన్ 19: మండలంలోని తాళ్లరాంపూర్ వడ్డెర కాలనీకి చెందిన బోదాసు గంగాధర్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బుధవారం రూ.పది వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, పార్టీ నాయకులు ఉన్నారు.

## పూర్వ ప్రాథమిక సంరక్షణ విద్యపై శిక్షణ

డిచ్‌పల్లి, జూన్ 19 : పూర్వ ప్రాథమిక సంరక్షణ విద్యకు సంబంధించిన నూతన జాతీయ పాఠ్య ప్రణాళికపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణను మండల కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని డీఆర్సీ (డిసెబుల్ రిసోర్స్ సెంటర్)లో మండల కేంద్రంలో శిక్షణ తరగతులను డీడబ్ల్యూవో రసూల్ బీ ప్రారంభించారు. 8 బ్యాచ్‌లకు జూలై 24వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతందని తెలిపారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ప్రాజెక్టు అధికారి స్వర్ణలత, ట్రైనీ సూపర్‌వైజర్లు సరిత, శోభ, బుజ్జి, సిబ్బంది పుష్ప, ప్రకాశ్, రంజిత్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కోటగిరి, జూన్ 19 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పొతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తర్ణ అధికారి గోవర్ధన్ అన్నారు. మండలంలోని ఎత్తొండలో బుధవారం ఆయన పర్యటించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఎత్తొండలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, సాయికుమారి, ఏఎన్ఎంలు సరోజ, రోజా, కార్యకర్తలు స్రవంతి, అరుణ, రమణి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## నూతన జీపీలో సౌకర్యాలు కల్పించాలి

ఆర్మూర్‌టౌన్, జూన్19: మండలంలోని హరిపూర్ తండా గ్రామస్తులు బుధవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. కేసీఆర్ సర్కారు హయాంలో రాష్ట్ర ప్రభుత్వం హరిపూర్ తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిందని అన్నారు. గ్రామ పంచాయతీ ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృషి చేశారని కొనియాడారు. ఇక్కడ ఇప్పటికీ కొత్త గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మించలేదని అన్నారు. కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నాయకులు, అధికారులు కృషి చేయాలని కోరారు.

## బీమా చెక్కు అందజేత

మోర్తాడ్, జూన్19: కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ తండాకు చెందిన గగులోత్ స్రవంతి ఇటీవల మృతిచెందడంతో బాధిత కుటుంబానికి బుధవారం ఎస్‌బీఐ మేనేజర్ తోటరాజబాబు రూ.2లక్షల 75వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఏజెన్సీ మేనేజర్ డాకూరిహరీష్, తిరుపతి, మురళీ, మధు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలి

ఆర్మూర్‌టౌన్, జూన్19: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందాలని ప్రిన్సిపాల్ కనక మహాలక్ష్మి కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో బుధవారం అధ్యాపకులు పట్టణంలోని పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

## అడ్మిషన్ల సంఖ్య పెంచాలి


అధ్యాపకులకు సూచనలిస్తున్న రవికుమార్

బోధన్, జూన్ 19: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు అధ్యాపకులు చర్యలు చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రవికుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న వసతులు, కోర్సుల గురించి విద్యార్థులకు వివరించాలని, అధ్యకులు అంకితభావంతో విధులు నిర్వహించాలని అన్నారు. సమయపాలన పాటించాలని, మెరుగైన విద్యాబోధన అందించాలని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

వినాయక్‌నగర్, జూన్ 19 : జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్ ఏరియాలో ఉన్న ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఫోర్త్ టౌన్ ఎస్సై సంజీవ్ బుధవారం తన సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. గోసంగి కాలనీలో ఓ వ్యక్తి వ్యభిచారం చేయిస్తుండగా దాడి చేసినట్లు వెల్లడించారు. ఈ దాడిలో నిర్వాహకుడితోపాటు ఒక విటుడు, ఓ మహిళను అదుపులోకి తీసుకొని, స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిర్వాహకుడు, విటుడిపై కేసు నమోదు చేశామని, మహిళను సఖీ సెంటర్‌కు కౌన్సెలింగ్ నిమిత్తం పంపినట్లు ఎస్సై వెల్లడించారు.

## 21న శత గళార్చన

సుభాష్‌నగర్, జూన్ 19 : లోక కల్యాణం కోసం, ప్రజల్లో తరిగిపోతున్న భక్తి చైతన్యాన్ని పెంపొందించడానికి ఈనెల 21న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సౌందర్యలహరి శత గళార్చన సామూహిక పారాయణం నిర్వహించనున్నట్లు శ్రీ పరిపూర్ణ వ్యవస్థాపక అధ్యక్షుడు వేలేటి పవన్‌శర్మ తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్‌లోని గీతాభవన్ ప్రాంగణంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న దత్తాత్రేయ ఆయన ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9394724529 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఆలయ ప్రతినిధి లింగారెడ్డి, సవిత, మాధవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

మోర్తాడ్/ రుద్రూర్, జూన్ 19 : మోర్తాడ్‌లోని ఎలాలవాడ ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు దండు గంగాధర్ యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌తోపాటు యూనిఫామ్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజాదేవి, శైలజ పాల్గొన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాతా నాగేందర్ బుధవారం ఏకరూప దుస్తులు, నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల ఎస్‌వో శ్యామల, ఎంపీడీవో సురేశ్‌బాబు, ఎంఈవో శాంతకుమారి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, సంతోషి పాల్గొన్నారు. ధర్పల్లి మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు, పేరెంట్స్ టీచర్ కమిటీ అధ్యక్షుడు చెలిమెల శ్రీనివాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్‌సాహెబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో తాజామాజీ సర్పంచ్ మృతి

మాక్లూర్, జూన్ 19: మండలంలోని ఒడ్డెట్‌పల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ రామడొల్ల రాజేశ్వర్ (56) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఒడ్డెట్‌పల్లి సర్పంచ్‌గా మూడు పర్యాయాలు పనిచేసి గ్రామస్తుల మన్ననలు పొందారు. ఆయన మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## పొలం దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

నవీపేట, జూన్ 19: మండలంలోని మహంతం గ్రామంలో వ్యవసాయ పొలంలో దమ్ము కొడుతున్న ఓ ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికుమార్(24) దినసరి వేతనంపై ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం గ్రామంలోని ఓ రైతుకు చెందిన పొలంలో దమ్ము చేసేందుకు వెళ్లాడు. దమ్ము కొడుతుండగా కేజీవీల్ ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మట్టిలో కూరుకు పోయి ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్సై యాదగిరి గౌడ్ పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

- **21న అంతర్జాతీయ యోగా దినోత్సవం -** డిచ్‌పల్లి, జూన్ 19 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ బిల్డింగ్‌లో ఈనెల 21న ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
- **జూలై 5న జగన్నాథ రథయాత్ర -** సుభాష్‌నగర్, జూన్ 19 : ఇస్కాన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో జూలై 5 నుంచి 8వ తేదీ వరకు జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ జిల్లా శాఖ అధ్యక్షుడు సిద్ధ బలరామదాస్ తెలిపారు. రథయాత్ర చేపట్టనున్న నేపథ్యంలో పాతగంజ్ ప్రాంగణంలో మండప నిర్మాణానికి బుధవారం కార్పొరేటర్ మల్లేశ్ భూమిపూజ చేశారు.
- **22న మండల సర్వసభ్య సమావేశం -** డిచ్‌పల్లి, జూన్ 19 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 22న ఉదయం 11 గంటలకు ఎంపీపీ చిన్నోళ్ల నర్సయ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీవో రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు, డివిజన్, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.
- **పంటల పరిశీలన -** డిచ్‌పల్లి, జూన్ 19 : మండలంలోని ముల్లంగి గ్రామంలో సీబీఈ క్రాప్ బుకింగ్ వెరిఫికేషన్‌లో భాగంగా జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ రైతులు సాగు చేస్తున్న పంటలను బుధవారం పరిశీలించారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో ఏ రైతు ఏ సర్వే నంబర్‌లో ఏ రకం పంట సాగుచేస్తున్నారు, ఆ సర్వే నంబర్లను క్షేత్రస్థాయిలో జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాంబాబు, ఏఈవో భావన, రూపేశ్, రైతులు పాల్గొన్నారు.
- **ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు -** డిచ్‌పల్లి, జూన్ 19 : మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్ శాఖ అధికారులు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం బిగించారు. ఓవర్‌లోడ్‌తో సమస్యలు తలెత్తుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని ఏఈ సాయిలు తెలిపారు. సమస్య పరిష్కారం కావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.
- **24న కలెక్టరేట్ ఎదుట ధర్నా -** డిచ్‌పల్లి, జూన్ 19 : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి దాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని పేర్కొన్నారు.
- **మధ్యాహ్న భోజనం పరిశీలన -** ధర్పల్లి, జూన్ 19 : మండలంలోని సల్లగరిగె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో బాలకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా కేశారం, మైలారం, ఒడ్డెర కాలనీ, సల్లగరిగె గ్రామాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు.
- **సర్వేను పకడ్బందీగా చేపట్టాలి -** ధర్పల్లి, జూన్ 19 : మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని ప్రాజెక్టు రామడుగు, సల్లగరిగె, దుబ్బాక గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు.
- **లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల బకాయి వేతనాలను చెల్లించాలి -** ఖలీల్‌వాడి, జూన్ 19 : జిల్లాలోని అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్‌లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మికులు బుధవారం విస్తృత సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో లిఫ్ట్ ఇరిగేషన్ నాయకులు గణేశ్, మహిపాల్, కార్తీక్, అజయ్, సతీశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.
- **26న డీవీ కృష్ణ వర్ధంతి-** సిరికొండ, జూన్ 19 : ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త డీవీ కృష్ణ విప్లవకారులకే ఆదర్శమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ అన్నారు. ఈనెల 26న డీవీ కృష్ణ 2వ వర్ధంతి సందర్భంగా మండలంలోని గడ్కోల్ గ్రామంలో కరపత్రాలను ఆయన బుధవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో స్మారక స్తూపాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.
- **విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ-** రెంజల్, జూన్ 19: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం లోటస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ అందజేశారు. చిన్న వెంకట్‌రెడ్డి కూతురు చామకూర సరోజ లోటస్ ఫౌండేషన్ (ఎన్‌జీవోస్) ద్వారా రెండు పాఠశాలలకు చెందిన 240 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేసినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆంజనేయులు, హెచ్‌ఎం అనురాధ తెలిపారు.